నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 5 నవంబర్ 2024 | SURYAPET

డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే సామేల్, అధికారులు

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అభినందనీయం

- సూర్యాపేటలో డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, నవంబర్ 4 : దేశంలోనే తెలంగాణ పోలీసులు ప్రథమ స్థానంలో ఉన్నారని, శాంతి భద్రతల రక్షణలో వారి సేవలు అభినందనీయమని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం డీఎస్పీ కార్యాలయంతోపాటు నివాస గృహాన్ని మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ, పోలీస్ హౌసింగ్ ఐజీ రమేశ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్‌శాఖకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానన్నారు. సూర్యాపేట జిల్లాలో నూతనంగా ఏర్పడ్డ అనంతగిరి, చింతలపాలెం, పాలకవీడు, మద్దిరాల, నాగారం పోలీస్‌స్టేషన్లకు కొత్త భవనాలు నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పోలీసు భవనాల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ సొసైటీ కృషి చేస్తుందన్నారు.

నూతన డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రవిని కూర్చోబెట్టి మంత్రితో పాటు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, అదనపు ఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సూర్యాపేట పబ్లిక్‌క్లబ్ చైర్మన్ వేణారెడ్డి, సూర్యాపేట డివిజన్ సీఐ లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చిరుమర్తి లింగయ్య

రైతులపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం

- ధాన్యం తెచ్చి నెల రోజులైనా కొనరా?
- అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు
- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, నవంబర్ 4 : రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తెచ్చి నెల రోజులైనా కొనుగోలు చేయరా.. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఇంత నిర్లక్ష్యమని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి అనంతరం విలేకరులతో మాట్లాడారు. మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మళ్లీ వాటివైపు అధికారులు, ప్రజాప్రతినిధులు తిరిగి చూడలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోళ్లు చేయలేదని, అధికారులతో సంబంధిత సమావేశాలు ఏర్పాటు చేయలేకపోయారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ చెల్లించి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరికోతలు ప్రారంభమై నెల గడుస్తున్నా కొన్ని చోట్ల గన్నీ బ్యాగులు కూడా లేవని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్దకు సరైన సమయానికి లారీలు కూడా రావడం లేదని, అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అకాల వర్షాలతో రైతులు కంటికి నిద్ర లేకుండా కేంద్రాల వద్ద పడిగాపులుకాస్తున్నారని అన్నారు. చిన్న, పెద్ద కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించాలని, మాటలు మితిమీరవద్దని హెచ్చరించారు. రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ యానాల అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, కర్నాటి ఉపేందర్, మహేశ్వరం సతీశ్, శ్రీను, దోసపాటి విష్ణుమూర్తి, పర్రెపాటి యాదగిరి, వాజిద్, పకీర్ సత్తిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కనగల్ పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్‌లు

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

- జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్లకుండా అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు
- పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు పిలుపు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు రూ.120 కోట్ల పెండింగ్ బకాయిలు

నల్లగొండ, నవంబర్ 4 : పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న మాజీ సర్పంచ్‌లను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా పోలీసులు ఆయా గ్రామాలకు వెళ్లి మాజీ సర్పంచులను అరెస్ట్ చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. ఉమ్మడి జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల్లో సుమారు రూ.120కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు సర్పంచులు అంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి నెలా రూ.29 కోట్ల చొప్పున ఇవ్వడంతో పాటు పలు అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదల చేసింది. ప్రధానంగా అన్ని గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు వేశారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని ఎన్నోసార్లు మాజీ సర్పంచులు సీఎం రేవంత్ దగ్గరకు వెళ్లి మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ బిల్లులు ఇవ్వకపోవడంతో సోమవారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశానుసారం అన్ని గ్రామాల్లో ఉన్న సర్పంచులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రానికి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ధాన్యం కొనే దిక్కేది?

కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు

- ముందుకు సాగని కొనుగోళ్లు
- నెల రోజుల్లో కొన్నది 14,370 మెట్రిక్ టన్నులే
- సన్న ధాన్యం నిల్... బోనస్ జీరో
- ప్రభుత్వం తీరుతో కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలిస్తున్న రైతులు
- క్వింటాకు 2వేల లోపే ధర
- కాంగ్రెస్ సర్కారుపై అన్నదాతల ఆగ్రహం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్4(నమస్తే తెలంగాణ) : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అరిగోస పడుతున్నారు. ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు అస్సలు పొంతన ఉండడం లేదు. సరిగ్గా నెల రోజుల కిందట నల్లగొండ జిల్లాలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఇప్పటికీ ఒక అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా కొనుగోళ్లు ఉన్నాయి. జిల్లాలో వానకాలం సీజన్‌లో 7.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. కొనుగోళ్లు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఆదివారం సాయంత్రానికి కొనుగోలు చేసిన ధాన్యం 14,370 మెట్రిక్ టన్నులు మాత్రమే. అంటే, రెండు శాతం ధాన్యం కూడా కొనుగోలు జరుగలేదు. ఈ సీజన్‌లో జిల్లాలో మొత్తం 346 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 266 కేంద్రాల్లో దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లు, 80 కేంద్రాలను సన్న ధాన్యం కొనుగోళ్ల కోసం ఏర్పాటు చేశారు. కేంద్రాలను దశల వారీగా ప్రారంభించినా నేటికీ కొనుగోళ్లు ఊపందుకోవడం లేదు. ఇందులో ప్రభుత్వం నాన్చివేత ధోరణే పెద్ద ప్రతిబంధకంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించాక వెంటనే ధాన్యాన్ని అక్కడి నుంచి లిఫ్ట్ చేయాల్సి ఉంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు సమీపంలోని రైస్‌మిల్లులను కేటాయిస్తారు. కానీ మిల్లర్లతో ప్రభుత్వం చర్చల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటున్నది. పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌పోర్ట్ చార్జీలతోపాటు మిల్లింగ్ చార్జీలు క్లియర్ చేయాలని మిల్లర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. ఇదే సమయంలో ధాన్యం కేటాయింపునకు గానూ ప్రభుత్వం మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీల షరతు విధించింది. దీనిపై రోజుల తరబడి జాప్యం జరిగింది. అప్పగించిన ధాన్యాన్ని కష్టం మిల్లింగ్ రైస్‌గా తిరిగి ఇచ్చేప్పుడు మిల్లర్లు 67 కేజీల బియ్యం ఇవ్వాలనేది ప్రభుత్వ నిబంధన. సన్నధాన్యం విషయంలో అంత స్థాయిలో బియ్యం రావంటూ 58 నుంచి 60 కేజీల వరకే ఇవ్వగలమని మిల్లర్లు పేచీ పెడుతూ వచ్చారు. ఇలా రైస్ మిల్లర్లతో చర్చల మీద చర్చలు జరుగుతున్న సమయంలోనే పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి పడుతున్నది. ఆ స్థాయిలో కొనుగోళ్లు మాత్రం ఉండడం లేదు. దాంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెజార్టీ సెంటర్లలో ధాన్యం తెచ్చి 15 రోజులు గడుస్తున్నా కొనడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం 17 వచ్చినా సరే కొనుగోళ్లు జరుపడం లేదని చెప్తున్నారు. ఇదే సమయంలో వర్షాలు కురుస్తుండడంతో తిరిగి ధాన్యం తడువడం లేదా తేమ శాతం పెరగడం జరుగుతున్నది. తిరిగి రైతులు మళ్లీ ధాన్యాన్ని ఆరబెట్టాల్సి వస్తున్నది. నిత్యం కొనుగోలు కేంద్రాల చుట్టూ రైతులు తిరిగి తిరిగి వేసారి పోతున్నారు.

మిల్లులకు దొడ్డు ధాన్యం విక్రయం

కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో విసిగిపోయిన రైతులు ధాన్యాన్ని వెనక్కి తీసుకుపోతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న దండంపల్లి, రెడ్డికాలనీ వంటి కొనుగోలు కేంద్రాల్లోనే పరిస్థితులు ఇలా ఉంటే ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ధాన్యం తెచ్చి 20 రోజులు గడుస్తున్నా, 17శాతం తేమ ఉన్నా కొనకపోవడం, వర్షాలు రావడం, ధాన్యం తడవడం ఇలా అనేక ఇబ్బందులతో రైతులు విసిగిపోయారు. దాంతో కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని తిరిగి ట్రాక్టర్లకు ఎత్తుకుని దగ్గరలోని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. వాస్తవంగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.2,320 మద్దతు ధర లభించేది. కానీ అక్కడ ఇబ్బందులు పడలేక క్వింటాకు రూ.300 నుంచి 500 వరకు నష్టం వచ్చినా సరే మిల్లులకు అమ్ముకునేందుకు రైతులు సిద్ధపడుతుండడం దయనీయ పరిస్థితిని కండ్లకు కడుతున్నది. దొడ్డు రకం ధాన్యానికి రైస్ మిల్లర్లు క్వింటా ఒక్కంటికి రూ.1,800 నుంచి 2,000 వరకు చెల్లిస్తున్నట్లు రైతులు చెప్తున్నారు. అయినా సరే తప్పని సరి పరిస్థితుల్లో అమ్ముకోక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కేసీఆర్ సర్కార్‌లో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు లేవని రైతులు గుర్తు చేస్తున్నారు.

సన్నాలు కొనేది ఎక్కడ?

దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లే ఇలా ఉంటే సన్నాల గురించి రైతులు ఊహించలేకపోతున్నారు. సన్నాల కోనుగోలు కోసం 80 కేంద్రాలు ఏర్పాటు చేస్తే నేటికీ ఒక్క గింజను కొన్న దాఖాలాలు లేవు. రైతులు ఆ కేంద్రాలకు ధాన్యం తెచ్చేందుకే సుముఖత చూపడం లేదు. దొడ్డు రకాల కొనుగోలుకే దిక్కు లేదు... సన్నాలు కొంటారంటే నమ్మేది ఎలా అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి విక్రయిస్తే క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర తోపాటు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించినా రైతులు ముందుకు రావడం లేదు. ఎప్పటిలాగే నేరుగా మిల్లు పాయింట్లకే సన్నాలను తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇక్కడ తేమ శాతంతో సంబంధం లేదు. నేరుగా పొలం నుంచి మిల్లులకు ధాన్యం తీసుకెళ్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అటూఇటూగా అందుతున్నది. ఇక ప్రభుత్వం ఆశ పెడుతున్న బోనస్ కోసం చూస్తే మొత్తానికే ఇబ్బంది పడాల్సి వస్తుందన్న అనుమానంతో సన్నాల రైతులు కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి చూడడం లేదు. కాగా, ఏడెనిమిదేండ్లల్లో ఎన్నడూ లేని విధంగా పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు ఈ వానకాలం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో పాటు సరైన ప్రణాళికలు రూపొందించడంలో విఫలమైనట్లు రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోళ్లు జరుపాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నల్లగొండలోని ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో 150 ధాన్యం కుప్పలు

నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణ పరిధిలోని ఆర్జాలబావి వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్రంలోనే మొదటి సారిగా గత నెల 9న జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి వారం రోజుల వరకు కొనుగోళ్లు చేపట్టలేదు. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు 450 ధాన్యం రాశులు వచ్చాయి. 21 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా 10 నుంచి 15 వేల క్వింటాళ్ల ధాన్యం వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో 150 ధాన్యం కుప్పలు ఉన్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షానికి రైతులు ఇబ్బందులు పడుతూ ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలోనే ఉన్నారు. లారీల అన్‌లోడ్ చేసుకోవడంలో ఆలస్యం అవుతున్నది. దీపావళి పండుగ ముందు ఒక నాలుగురోజులు లారీ రాలేదు. ప్రస్తుతం మ్యాచర్ వచ్చిన కుప్పలు 80 ఉన్నప్పటికీ వాటిని ఇంకా కాంటాకు వేయలేదు. కొనుగోలు చేసిన వారిలో కనీసం 10 మంది రైతుల ఖాతాల్లో కూడా డబ్బులు పడలేదు.

కొనుగోలు కేంద్రాల్లో ప్రారంభం కాని కాంటాలు

- కోసిన వెంటనే మిల్లులకు తరలిస్తున్న రైతులు

గరిడేపల్లి, నవంబర్ 4 : మండలంలో 15 రోజుల క్రితం ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇంతవరకు కాంటాలు మొదలు కాలేదు. మండలంలోని కీతవారిగూడెం, పొనుగోడు, గడ్డిపల్లి, సర్వారం గ్రామాలలో నాలుగు సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో గరిడేపల్లి మినహా అన్ని సహకార సంఘాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా రైతులు వడ్లు అమ్మటానికి సుముఖంగా లేరు. కల్లంలోనే రైతులు జేసీబీ, కూలీల సహాయంతో ట్రాక్టర్ల బోరంలో నింపి మిల్లులకు తరలిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర కోసం చూస్తే వడ్లు ఆరేసరికి పెట్టిన పెట్టుబడి కూడా రాదని, పంట కోసిన వెంటనే పచ్చి వడ్లను అదే రోజు మిల్లుకు పంపుతున్నారు.

పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మా మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కానీ ఏ ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రంలో కూడా కాంటాలు మొదలు కాలేదు. పది రోజుల క్రితం నామమాత్రంగా బ్యానర్లు కట్టి చేతులు దులుపుకున్నారు. కొనుగోలు కేంద్రంలో స్థలాన్ని శుభ్రం చేయకుండా, వసతులు కల్పించకుండా వదిలేశారు. మండలంలో పేరుకు 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నా ఏ ఒక్క ఊరిలో కూడా ఇప్పటివరకు ఒక్క గింజ కొన్న దాఖలాలు లేవు. రైతులు నానా ఇబ్బందులు పడుతూ మిల్లర్లకే ఎంతకోకొంతకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి.

- అనుముల శ్యాంసుందర్‌రెడ్డి, రైతు, త్రిపురారం

దళారుల చేతిలో మోసపోవాల్సి వస్తున్నది

ప్రభుత్వం సన్న రకాలను కొంటామని చెప్పింది. ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పింది. అధికారులు మాత్రం సహకార సంఘాల ద్వారా 9, మహిళా సంఘాల ద్వారా రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పున్నరు. కానీ ఎక్కడా వడ్లు పోసుకోండి అన్న నాథుడు లేడు. సహకార సంఘం వాళ్లను అడిగితే ఇంకా కొన్ని రోజులు పడుతుందని చెప్తున్నారు. బస్తాలు లేవు, కాంటాలు లేవు అంటున్నారు. మిల్లర్ల వద్దకు వడ్లు తీసుకెళ్తే వాళ్లకు నచ్చిన రేటుకు వడ్లను అడుగుతున్నారు. కోతలు అయిపోయి నారుమళ్లు పోస్తున్నాము. ముందు వచ్చిన వడ్లకు లేకపోయినా వెనుకవచ్చే వడ్లకైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. మిల్లర్ల వద్దకు వెళ్తే దళారుల చేతిలో మోసపోవాల్సి వస్తున్నది.

- అనుముల సుధాకర్‌రెడ్డి, రైతు, త్రిపురారం

ఆంధ్రా మిల్లులకు ధాన్యం

- ఐకేపీ కేంద్రాలు తెరిచినా ఒక్క వడ్లగింజ రాలేదు
- ఏపీలోని మిల్లులకు తరలిస్తున్న రైతులు

దామరచర్ల, నవంబర్ 4 : మండలంలోని రైతులు ప్రభుత్వం సన్న వరి ధాన్యానికి అందిస్తున్న బోనస్‌పై అంతగా ఆశచూపడం లేదు. పంట కొనుగోలు కోసం మండలంలోని దామరచర్ల, కొండ్రపోల్, కేజేఆర్‌కాలనీలో ఐకేపీ కేంద్రాలను వారం రోజుల క్రితం ఏర్పాటు చేశారు. ఇంతవరకు ఒక్క రైతు కూడా ధాన్యాన్ని కేంద్రాలకు తరలించలేదు. ఐకేపీ కేంద్రాలు కేవలం బోర్డులకు పరిమితమై వెలవెలపోతున్నాయి. దొడ్డు వడ్లు కొనుగోలు చేసేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి కూడా ధాన్యం రావడం లేదు. మండలంలో రైతులు పంట కోసిన వెంటనే సరాసరిగా మిల్లులకు తరలించి అమ్మకాలు జరుపుతున్నారు. కొంత మంది ఆంధ్రాకు తరలిస్తున్నారు. తెలంగాణ కంటే హెచ్ ఎంటీ రకం ధాన్యానికి ఆంధ్రాలో అధిక ధర పలుకడంతో రైతులు అక్కడికి తరలిస్తున్నారు. ఆంధ్రాలో సన్నాలకు క్వింటాకు రూ.2,500 వరకు మద్దతు ధర ఇస్తున్నట్లు రైతులు తెలిపారు. చింట్లు రకం ధాన్యం పడించిన రైతులు మిర్యాలగూడ మిల్లులకు తరలిస్తున్నారు. మిల్లుల్లో తేమశాతం 25 ఉన్నా కొనుగోలు చేసి రూ.2,450 వరకు గిట్టుబాటు ధర ఇస్తుండగా ఐకేపీ కేంద్రాల వద్ద 17 శాతం తేమ ఉండి నాణ్యతతో ఉంటనే రూ.2,320 మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తారని తెలుపడంతో రైతులు అంత ఆసక్తి చూపడం లేదు. సన్నాలు కోసిన తర్వాత ఆరపెడితే ఎందుకు పనికిరావని, 17 మ్యాచర్ వచ్చే వరకు వడ్లను ఎండపెడితే క్వింటాకు 20 కేజీల వరకు తరుగు వస్తుందని, అలాంటప్పుడు 500 బోనస్ ఇచ్చి లాభం ఏందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు వానలు పడుతున్న క్రమంలో, తేమశాతం అధికంగా ఉండటంతో సన్నాలు ఎండే పరిస్థితులు లేవు. దీనితో ఇన్ని బాధలు ఎవరు పడుతారని రైతులు కోసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తున్నారు.

దామరచర్లలో ధాన్యం లేక ఖాళీగా ఉన్న కొనుగోలు కేంద్రం

'ఉచితం'లో దెయ్యం చేపలు

- తొలిరోజు చెరువుల్లో పోసిన పిల్లల్లో డెవిల్ ఫిష్, క్యాట్ ఫిష్
- చర్లపల్లి, నర్సింగ్‌బట్లలో గుర్తించిన మత్స్యకారులు
- ఇవి మిగతా చేప పిల్లలను వెంటాడి తినేస్తాయని ఆవేదన

నల్లగొండ, నవంబర్ 4 : మత్స్యకారుల ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడాల్సిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఇప్పుడు ఉపాధిని దెబ్బతీసేలా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే చేప పిల్లల్లో డెవిల్ ఫిష్, క్యాట్ ఫిష్ ఉండడం ఆందోళనకు గురి చేస్తున్నది. నీటి వసతి లేకపోయినా వారం పాటు ఈ చేపలు చెరువుల్లో ఇతర చేప పిల్లలను తినేస్తాయని మత్స్యకారులు వాపోతున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని చర్ల పల్లి భీమసముద్రంలో సోమవారం మత్స్య శాఖ యంత్రాంగం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి 3.61 లక్షల చేప పిల్లలు విడదల చేయగా, అందులో ఇతర చేప పిల్లలను వేటాడి తినే డెవిల్, క్యాట్ ఫిష్ ఉండడం మత్స్యకారులు గుర్తించారు. దాంతో తాజాగా పోసిన చేప పిల్లల సంగతి అలా ఉంచితే, ఇప్పటికే చెరువులో ఉన్న చేప పిల్లల పరిస్థితి ఏంటని తలలు పట్టుకోవాల్సి వస్తున్నది.

ఇతర చేపలను వెంటాడి వేటాడి తినేవే డెవిల్, క్యాట్ ఫిష్..

డెవిల్ ఫిష్, క్యాట్ ఫిష్ తినడానికి పనికి రావు. ఇవి నీటి వనరుల్లోని ఇతర చేప పిల్లలను కూడా తినేస్తాయి. పెద్ద చేపలను కూడా ఇవి వేటాడుతాయని మత్స్యకారులు చెబుతున్నారు. అలాంటి ప్రమాదకరమైన డెవిల్, క్యాట్ ఫిష్ పిల్లలు ప్రభుత్వం ఉచితంగా విడుదల చేస్తున్న చేప పిల్లల్లో కలిసి వస్తున్నాయి. సోమవారం నల్లగొండ మండలంలోని మండలంలోని నర్సింగ్‌బట్ల, పాతూరు, చర్లపల్లి చెరువుల్లో మొత్తం 5.55 లక్షల చేప పిల్లలను వదలగా.. వాటిల్లో డెవిల్ ఫిష్, క్యాట్ ఫిష్ కలిస వచ్చాయి. కొందరు మత్స్యకారులకు కొన్నింటిని తీసి చంపేయగా, గుర్తించని వాళ్లు చెరువులో పోశారు. ఈ ఘటనపై చర్లపల్లిలో సొసైటీ అధ్యక్షుడిపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఘర్షణకు దిగారు.

కైకలూరు నుంచి నల్లగొండకు..

నల్లగొండ జిల్లాలో టెండర్ వేసిన కాంట్రాక్టర్లు తమకు స్థానికంగా ఫిష్ సీడ్ ఫామ్స్ లేక పోవడంతో ఏపీలోని కైకలూరు నుంచి చేప పిల్లలను తీసుకొచ్చినట్లు మత్స్యకారులు చెబుతున్నారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన రెండో ఏడాది నుంచే ప్రభుత్వ ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను విడుదల చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో జరిగిన టెండర్ల తర్వాత జిల్లాలో ఫిష్ సీడ్ ఫామ్స్ లేవని, చిన్నవి ఉన్నా అందులో సీడ్ సరిపోనూ లేదని మత్స్యశాఖ యంత్రాంగం టెండర్లు రద్దు చేసింది. కానీ, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఫిష్ సీడ్ లేకపోయినప్పటికీ వారికే ఫైనల్ చేయడం గమనార్హం.

దెయ్యం చేపలతో చాలా నష్టం

దెయ్యం(డెవిల్) చేపలు చెరువుల్లోని ఇతర చేప పిల్లలను చంపి తింటాయి. వాటి కారణంగా పోసిన చేప పిల్ల ల్లో 80 శాతం దాకా బతకడ ం కష్టమే. ఇలాంటి ప్రమాదకరమైన చేపలు తెచ్చి పోయడం మంచిది కాదు. మేము మొద ట గుర్తు పట్టలేక పోయాం. గుర్తు పట్టేలోపు అన్నీ చెరువులో పోశాం.

-మారయ్య, మత్స్యకారుడు, చర్లపల్లి

ఎప్పటి ధాన్యం అప్పుడే మిల్లులకు తరలించాలి

- పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్

నార్కట్‌పల్లి/చిట్యాల, నవంబర్ 4 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. నార్కట్‌పల్లి, చిట్యాలలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం కుప్పల తేమ శాతాన్ని యంత్రం ద్వారా పరిశీలించారు. దొడ్డు, సన్నరకం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్‌లోడ్, హమాలీలు, లారీల సమస్యలను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు ప్రతిరోజూ ధాన్యం పంపిన వెంటనే అన్‌లోడ్ చేసుకుంటున్నారని, ఎలాంటి సమస్యలు లేవని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సన్న రకం ధాన్యం కేంద్రాలు 80కి పైగానే ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. గతంలో సీఎంఆర్ సకాలంలో చెల్లించిన మిల్లర్లందరికీ రొటేషన్ పద్ధతిలో సీఎంఆర్ ఇవ్వాలని డీఎస్ చౌహాన్ సూచించారు. ఈ సంవత్సరం సన్న రకానికి ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తుందని, జనవరి నుంచి 2.81 కోట్ల మందికి రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, మే